
ప్రజాశక్తి
శనివారం 6 సెప్టెంబర్ 2025
5
పార్వతీపురం మన్యం



లక్ష్మణరావుకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

ప్రజాశక్తి - కొమరాడ

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన కొమరాడ గురుకుల పాఠశాల హెచ్ఎం డి.లక్ష్మణరావు శుక్రవారం విజయవాడలో ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. 1992 లో ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల ఒమరవల్లి లో గణిత ఉపాధ్యాయునిగా ఉద్యోగంలో చేరిన లక్ష్మణరావు పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్‌గా, హెచ్ఎంగా 33ఏళ్ల పాటు సర్వీసులో విద్యార్థుల సర్వతోముఖాభివద్ధికి అంకిత భావంతో పనిచేశారు. మన్యం జిల్లాలో నే కాకుండా విశాఖ జిల్లా కలెక్టర్ ద్వారా, పార్వతీపురం ఐటిడిఎ పిఒ నుంచి పలుమార్లు ప్రశంసలు అందుకున్నారు. విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలకు విద్యార్థులకు తయారు చేయడం, క్రీడల్లో ప్రోత్సహించి రాష్ట్ర స్థాయిలో పాఠశాలను ముందు వరుస లో నిలుపుతూ అధికారుల మన్ననలు అందుకున్నారు.




ఆర్టీసి కాంప్లెక్స్ వద్ద మానవహారం నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

ప్రభుత్వమే వైద్య కళాశాలను ఏర్పాటు చేయాలి

- ప్రయివేటు భాగస్వామ్యం వద్దు
- సిపిఎం ఆధ్వర్యాన ర్యాలీ, నిరసన

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణంలో ప్రైవేట్ భాగస్వామ్య నిర్ణయాన్ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి అన్నారు. ప్రభుత్వ వైద్యారంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని జోడిస్తూ టిడిపి కేబినెట్ చేసిన నిర్ణయాన్ని సిపిఎం మన్యం జిల్లా కమిటీ ఖండిస్తూ శుక్రవారం స్థానిక సుందరయ్య భవనం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకూ ర్యాలీ నిర్వహించి, అక్కడ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ నిర్ణయాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం పాలన చేపడుతోందని, ఇది ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని అన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వ వైద్య రంగాన్ని ప్రైవేటీకరించే భాగంలోనే టిడిపి క్యాబినెట్ ఈ నిర్ణయం చేపట్టిందని తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించి సామాన్యులకు ప్రభుత్వ వైద్యను దూరం చేసిందని అన్నారు. చంద్రబాబు ప్రభుత్వ మోడీ నిర్ణయాలను వ్యతిరేకించి రాష్ట్ర ప్రజల నిర్ణయాలకు కట్టుబడి ఉండాలని, వెంటనే ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు మాట్లాడుతూ కొత్తగా మంజూరైన వైద్య కళాశాలల నిర్మాణాన్ని, నిర్వహణను ప్రభుత్వ ఆధ్వర్యంలోనే చేపట్టాలని కోరారు. వైద్య విద్యను అభ్యసించే విద్యార్థుల అవసరాలకు తగ్గట్టుగా వైద్య కళాశాలల్లో సీట్లు పెంచేందుకు జాతీయ వైద్య మండలిపై ఒత్తిడి తేవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన వైద్య కళాశాలలను పిపిపి విధానంలో చేపట్టేందుకు ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసిందన్నారు. ప్రజల ఆరోగ్య హక్కును పరిరక్షించడంలో ప్రభుత్వ జవాబుదారీతనంపై ఇది తీవ్ర ప్రభావాన్ని చూపుతుందన్నారు. మరోవైపు ప్రైవేటు వైద్య కళాశాలల్లో విచ్చలవిడిగా జరుగుతున్న అవినీతిని సిబిఐ ఇటీవల బహిర్గతం చేసిన నేపథ్యంలో ప్రజాప్రయోజనాలను కాపాడటానికి ఈ ప్రైవేటీకరణ ప్రతిపాదనను తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై సిపిఎం అనేక పర్యాయాలు తన ఆందోళనను వ్యక్తం చేసిందన్నారు. జాతీయ, రాష్ట్ర నిపుణులు, మేధావులు, ప్రజలు ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను తీవ్రంగా వ్యతిరేకించాలని కోరారు. వైద్య విద్యను ప్రైవేటీకరించడం వల్ల పేదల వర్గాలకు చెందిన విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షగా మిగిలిపోతుందన్నారు. ప్రైవేటు సంస్థలకు ప్రభుత్వ వైద్య కళాశాలల నియంత్రణను అప్పగించడం వల్ల ఫీజులు అధికమవ్వడం, జవాబుదారీతనం తగ్గడం, సేవ కంటే ఆదాయానికే ప్రాధాన్యత ఇవ్వడంతో పేద విద్యార్థులకు విద్య, రోగులకు వైద్యం అందుబాటులో ఉండవని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్వై నాయుడు, జిల్లా కమిటీ సభ్యులు గొర్లి వెంకటరమణ, బివి రమణ, రెడ్డి వేణు, కొల్లి సాంబమూర్తి, రెడ్డి శ్రీదేవి, కోరాడ ఈశ్వరరావు, మర్రి శ్రీను, నాయకులు బి.సూరిబాబు, సింహాచలం, రాము, రెడ్డి ఈశ్వరరావు, ఎం.ఉమామహేశ్వరి, బి.లక్ష్మి, జి.తులసి, రాము తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రమంత్రి సంధ్యారాణి చేతులు మీదుగా అవార్డులు అందుకుంటున్న జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు

విద్యార్థులను సన్మార్గంలో పెట్టే బాధ్యత టీచర్లదే

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

విద్యార్థులను మంచి మార్గంలో పెట్టి, వారిని భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులేదనని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమశాఖామంత్రి జి.సంధ్యారాణి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం స్థానిక లయన్స్ క్లబ్‌లో శుక్రవారం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో గొప్ప సంతృప్తి ఉంటుందన్నారు. చిన్నారులను బంగారు ముద్దగా తీర్చిదిద్దే అవకాశం ఉపాధ్యాయులే అన్నారు. గురువులు చూపిన మార్గంలో విద్యార్థులు ఉంటారని ఆమె చెప్పారు.పిల్లల్లో ఫోన్, ఇతర యాంత్రిక పరికరాల వినియోగం అవసరానికి మించి ఉండకుండా చూడాలని ఆమె కోరారు. పాఠాలతో పాటు నైతిక విలువలు నేర్పించాలని విజ్ఞప్తి చేశారు. 'డ్రగ్స్ వద్దు బ్రో' శీర్షికన ప్రచారం చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. మెగా డిఎస్సీ ద్వారా కొత్త ఉపాధ్యాయులు వస్తున్నారన్నారు. అలాగే పార్వతీపురంలో వైద్య కళాశాలను ఏర్పాటుకు ప్రభుత్వం అంగీకారం తెలిపిందన్నారు. కురుపాంలో ఇంజినీరింగ్ కాలేజీని పూర్తి చేసేందుకు ముఖ్య మంత్రి చర్యలు చేపట్టారని ఆమె చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉత్తమ ఉపాధ్యాయులు కావాలని ఆకాక్షించారు. విద్యార్థులకు మంచి అలవాట్లు నేర్పించాలని, డ్రగ్స్ వంటి దురలవాట్లకు దూరంగా ఉంచాలని కోరారు. పార్వతీపురం ఎమ్మెల్యే బి.విజయచంద్ర మాట్లాడుతూ బతుకు విలువ, మెతుకు విలువ నేర్పినవారు నా గురువులు అన్నారు. "మా జీవిత శిల్పులు మీరు" అన్నారు. విద్యా శాఖ మంత్రి రాష్ట్రంలో విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నారని చెప్పారు. కలెక్టర్ ఎ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో పదో తరగతిలో ప్రథమ స్థానంలో ఉంచినందుకు అభినందించారు. జాతీయ స్థాయిలో సర్వేలో కనీస అభ్యసన స్థాయిలో పదో స్థానంలో ఉన్నామని చెప్పారు. ఉపాధ్యాయుడు అదృశ్య శక్తిగా ఉంటారన్నారు. గురువు తయారు చేసిన శిష్యులు సమాజానికి మార్గదర్శిగా, ఆదర్శప్రాయుడుగా, వివిధ హోదాల్లో ఉంటారని ఆయన చెప్పారు. డిఇఒ రాజ్ కుమార్ మాట్లాడుతూ పేద విద్యార్థులను దత్తత తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లాలో రూపొందించిన "బాల వెలుగు" మాస పత్రికను మంత్రి, అతిథులు ఆవిష్కరించారు. ఉత్తమ ఉపాధ్యాయులను జ్ఞాపిక, దుశ్శాలువతో సత్కరించారు. వివిధ పాఠశాలలు ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ ను మంత్రి పరిశీలించారు. కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ల బోర్డు డైరెక్టర్లు గొట్టాపు వెంకటనాయుడు, రామకృష్ణ, సర్వ శిక్షా అభియాన్ ఎపిసి టి.తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కురుపాం :మండలంలోని మరిపల్లి పంచాయతీలో గల కాగుమానుగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్నటువంటి ఉపాధ్యాయుడు తోట శంకరరావు విద్యార్థులకు అందించిన సేవలను గుర్తించి ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మన్యం జిల్లా కేంద్రంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవార్డు మరింత బాధ్యతను పెంచిందని, పాఠశాల అభివృద్ధికి విద్యార్థులు విద్యా ప్రమాణాల మెరుగుకు తన వంతుగా కృషి చేస్తానని అన్నారు. అవార్డు అందుకున్న ఉపాధ్యాయుడు శంకరరావుకు ఎంఇఒలు, తోటి ఉపాధ్యాయులు, పలువురు ప్రజా ప్రతినిధులు అభినందించారు.

పాలకొండ : మండలంలోని రాజపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాసపు వాసుదేవరావుకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును మంత్రి సంధ్యారాణి, ప్రభుత్వ విప్ జగదీశ్వరి, కలెక్టర్ శ్యాం ప్రసాద్ గారి చేతుల మీదుగా అందుకున్నారు. ఈయన గతంలో ఎరకారాయపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేశారు. ఈయన చేసిన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు వచ్చింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను పని చేసే పాఠశాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పని చేస్తానన్నారు

వీరఘట్టం : జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి ఎంఇఒలు డి.గౌరినాయుడు, ఆనందరావుతోపాటు ఆయా పాఠశాలల సిబ్బంది, ఎంఆర్‌సి సిబ్బంది అభినందనలు తెలిపారు. అవార్డులు అందుకున్న వారిలో నర్సిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం ఈశ్వరరావు, తెట్టంగి జెడ్‌పి హైస్కూలు హెచ్ఎం డి. నాగమణి, నర్సిపురం స్కూల్ అసిస్టెంట్ (తెలుగు) బి.యోగేశ్వరరావు, గొటివాడ స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఎస్) వెంకటరమణ, గంగంపేట గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ (పిఎస్) బి.కైలాసరావు, కె.ఇచ్ఛాపురం ఎంపిపి పాఠశాల ఉపాధ్యాయులు టి.జగన్నాథం, చిన్న గోరా ఎంపి యుపిఎస్ కెటి టివి పోలినాయుడు, హుస్సేన్ పురం ఎంపియుపిఎస్ ఉపాధ్యాయుడు ఎ.స్వామి బాబు, వండువ ఎంపిపిఎస్ ఎ.సూర్యనారాయణ, బూరుగ ఎంపిపిఎస్ టీచర్ కె.ప్రమీలా రాణి, కిమ్మి ఎంపిపిఎస్ టీచర్ బి.వాసుదేవరావు ఉన్నారు.

ఉపాధ్యాయ దినోత్సవంలో మంత్రి సంధ్యా రాణి



రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేస్తున్న మంత్రి, కలెక్టర్



నృత్యం చేస్తున్న విద్యార్థినులు



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న మంత్రి సంధ్యారాణి

ఐటిడిఎలకు ఇన్‌ఛార్జి పిఒలు

- పక్క జిల్లాకు రెగ్యులర్ అధికారులు
- మంత్రి ఉన్న జిల్లాపై ఎందుకింత చిన్నచూపు
- అభివృద్ధికి నోచుకోని ఏజెన్సీ ప్రాంతాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని ఐటిడిఎలకు రెగ్యులర్ ప్రాజెక్టు అధికారులు లేకపోవడంతో ఏజెన్సీ ప్రాంతాల్లోని సమస్యల పరిష్కారంపై దృష్టి సారించలేని పరిస్థితి నెలకొంది. గడచిన ఏడాదిన్నర కాలం గా జిల్లాలో ఉన్న సీతంపేట, పార్వతీపురం ఐటిడిఎలకు ప్రభుత్వం రెగ్యులర్ పిఒలను నియమించలేదు. ఇన్‌ఛార్జి అధికారులతోనే కాలక్షేపం చేస్తోంది. మన్యం జిల్లా ఏర్పడిన తర్వాత శ్రీకాకుళం జిల్లా పాలకొండ నియోజకవర్గంలో ఉన్న సీతంపేట ఐటిడిఎ పార్వతీపురం మన్యం జిల్లాలో కలిసిపోయింది. తద్వారా మన్యం జిల్లాలో రెండు ఐటిడిఎలు ఉన్నాయి. పేరుకే మన్యం జిల్లా అయినప్పటికీ ఇక్కడ పనిచేస్తున్న వారిలో ఎక్కువ మంది వివిధ ప్రభుత్వ శాఖలకు ఇన్‌ఛార్జి అధికారులే ఉన్నారు. ప్రభుత్వ శాఖ లకు ఇన్‌ఛార్జి అధికారులతోనే గడిచిన మూడున్నర ఏళ్ళు గా పాలన సాగుతోంది. జిల్లా కలెక్టర్, జెసి వరకు రెగ్యులర్ అధికారులు వస్తున్నారు. మిగిలిన అన్ని శాఖల్లో ఎక్కువ శాఖలకు ఇన్‌ఛార్జి అధికారులే పని చేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. కీలకమైన రెండు ఐటిడిఎలకు రెగ్యులర్ ప్రాజెక్టు అధికారులు లేకపోవడంతో ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. మన్యం జిల్లా ఏర్పాటైన తర్వాత ఐటిడిఎల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందనే వాదనలు వినిపిస్తున్నాయి. నిన్నటి వరకు జిల్లాలోని రెండు రెవెన్యూ డివిజన్లకు చెందిన సబ్ కలెక్టర్లే సీతంపేట, పార్వతీపురం ఐటిడిఎలకు పిఒలుగా వ్యవహరించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రెండు డివిజన్లకు కొత్త సబ్ కలెక్టర్లను నియమించింది. కానీ ఐటిడిఎ లకు మాత్రం రెగ్యులర్ పిఒలను నియమించలేదు. పాలకొండ సబ్ కలెక్టర్ స్వప్నిల్ పవర్ జగన్నాథ్‌ను పూర్తి అదనపు బాధ్యతలతో సీతంపేట ఐటిడిఎ పిఒగా నియమించింది. మొన్నటి వరకు పాలకొండ సబ్ కలెక్టర్, సీతంపేట ఐటిడిఎ పిఒగా పని చేసిన యశ్వంత్ కుమార్ రెడ్డిని మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా నియమిస్తూ పార్వతీపురం ఐటిడిఎ పిఒగా అదనపు బాధ్యతలు అప్పగించింది. జిల్లా స్థాయి రెవెన్యూ అధికారులుగా పని చేస్తూ ఐటిడిఎ పిఒలుగా పని చేయడం వల్ల రెండు విభిన్న శాఖల్లో సమస్యల పరిష్కారంపై దృష్టి సారించడంతో వారు తీవ్రమైన పని ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉంది. దీనివల్ల ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలపై అధికారులు దృష్టి పెట్టలేని పరిస్థితి కనిపిస్తోంది. వైసిపి ప్రభుత్వం హయాంలో రెండు ఐటిడిఎలకు రెగ్యులర్ ప్రాజెక్టు అధికారుల నియామకం జరిగింది. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఐటిడిఎ లు ఇన్‌ఛార్జి అధికారులతో కాలక్షేపం చేయిస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మన్యం జిల్లా నుంచి ఎన్నికైన ఎమ్మెల్యే గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్నప్పటికీ సీతంపేట, పార్వతీపురం ఐటిడిఎలకు రెగ్యులర్ పిఒలను నియమించకపోవడం చర్చనీయాంశమవుతోంది. పక్కనే ఉన్న అల్లూరి సీతారామరాజు జిల్లాలోనూ రెండు ఐటిడిఎ లున్నాయి. పాడేరు, రంపచోడవరం ఐటిడిఎలకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులర్ పిఒలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పార్వతీపురం మన్యం జిల్లాలో ఉన్న రెండు ఐటిడిఎలకు ఇన్‌ఛార్జి పిఒలతో కాలక్షేపం చేయడం, అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉన్న ఐటిడిఎలకు రెగ్యులర్ పిఒలను నియమించడంపై గిరిజన సంఘాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. మంత్రిగా సంధ్యారాణి ఉన్న మన్యం జిల్లాలో ఐటిడిఎలకు రెగ్యులర్ ప్రాజెక్టు అధికారులను నియమించకపోవడం అత్యంత వెనుకబడిన జిల్లాపై చిన్నచూపు చూడడమేనని గిరిజన సంఘాల నాయకులు భావిస్తున్నాయి. సాక్షాత్తూ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి ఉన్నా మన్యం జిల్లాకు ఒరిగిందేమీ లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



ఘనంగా మిలాద్ ఉన్ నబీ

ప్రజాశక్తి-సాలూరు రూరల్

మహోన్నతుడు మహమ్మద్ ప్రవక్త స్ఫూర్తితో జాలి, దయ, కరుణ కలిగి ఉండాలని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా శుక్రవారం పట్టణంలో ముస్లిములు చేపట్టిన ర్యాలీని మంత్రి సంధ్యారాణి జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త బోధనలు, ప్రవచనాలు, ఆలోచనలు, మానవతా విలువలు, సత్యం, ప్రేమ, శాంతి సూత్రాలు ప్రతి ఒక్కరికి స్ఫూర్తినిచ్చేవనీ, సమాజంలో ఐకమత్యం, సౌభ్రాతత్వం, మతసహనం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ముసిములు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

కురుపాం : ఈద్ మిలాద్ ఉన్ నబీ పండగను పురస్కరించుకొని ముస్లిములు కురుపాంలో గల శివన్నపేట జామీయ మసీదు వద్ద శుక్రవారం మత గురువు దిల్ మహమ్మద్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్ర, జీవన శైలి గురించి వివరించారు. ఆయన జన్మదినం నాడే పండగను జరుపుకోవడానికి గల ఆవశ్యకత గూర్చి వివరించారు. అనంతరం శివన్నపేట మసీదు నుంచి కురుపాంలో గల రావాడ జంక్షన్ వరకు ముస్లిములు కుటుంబ సభ్యులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ముస్లిములు షేక్ గౌస్, షేక్ జిలాని, షేక్ నిసార్, షేక్ నూరేళ్ళ, షేక్ ఆదిల్, ఇమ్రాన్, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంటౌన్ : ముస్లిము సోదరులకు ఎంతో ప్రధాన్యత గల ఈద్ మీలాదుల్ నబీ (మొహమ్మద్ ప్రవక్త వారి జన్మదిన వేడుక)లో స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పాల్గొన్నారు. పాలకొండ రోడ్ లో గల జామియా మస్జిద్ వద్ద ముస్లిం సోదరులతో కలిసి పాల్గొని ప్రత్యేక నమాజు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిములకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. అల్లా ఆశీస్సులు మనఅందరిపై ఉంటాయని అన్నారు. భారతదేశం సెక్యూలరిజం కలిగిన దేశమని, అందరం కలిసికట్టుగా సోదరాభావంతో కలిసి మెలిసి జీవిస్తున్నామని అన్నారు. ప్రవక్త చూపించిన శాంతి, సన్మార్గంలో నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ముస్లిం కమ్యూనిటీ జిల్లా ప్రెసిడెంట్ సయ్యద్ ఇబ్రహిం, కుల పెద్దలు, కమిటీ సభ్యులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి



కురుపాంలో ర్యాలీ చేస్తున్న ముస్లిములు

నేడు మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని తెలుగు బాప్టిస్ట్ దేవాలయ ఆవరణంలో ఈనెల 6న పాలకొండ శ్రీ విజయ మల్టీ స్పెషలిస్ట్ ఆస్పత్రి ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామస్తులు వినియోగించుకోవాలని వారు కోరారు.

తప్పిపోయిన వ్యక్తిని తీసుకొచ్చే బాధ్యత తీసుకుంటాం : కలెక్టర్

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని యారడ్లవలసకు చెందిన నిరుపేద గిరిజన కుటుంబానికి చెందిన బడ్నాన చిన్నారావు గత ఏడాది కూలి పనుల నిమిత్తం ప్రకాశం జిల్లా టంగుటూరి వెళ్లి తప్పిపోయాడు. ఆ వ్యక్తి ప్రస్తుతం జమ్మూ-కాశ్మీర్‌లో ఉన్నట్లు పోలీసులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి వెళ్లేందుకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో ప్రభుత్వమే తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. దీనికి ఎంపిపి బి.ప్రమీల స్పందించి జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్‌కు నేరుగా ఫోన్ చేసి తమ మండలానికి చెందిన నిరుపేద గిరిజన కుటుంబానికి చెందిన వ్యక్తి జమ్మూ కాశ్మీర్ ఉన్నాడని తీసుకొచ్చే ప్రయత్నం చేయాలని కోఆరరు. దీనికి ఆయన స్పందిస్తూ చిన్నారావును తీసుకొచ్చే బాధ్యత తాము తీసుకుంటామన్నారు. ఇందులో భాగంగా స్థానిక రెవెన్యూ అధికారులు చిన్నారావు కుటుంబ సభ్యుల వద్దకు వెళ్లి శుక్రవారం వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ కు, ఎంపీపీ ప్రమీలకు చిన్నారావు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



వైద్యాధికారులకు సూచనలు ఇస్తున్న సబ్ కలెక్టర్ పవార్

ఏరియా ఆసుపత్రిని సందర్శించిన సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని సబ్ కలెక్టర్ పవార్ స్వప్నల్ జగన్నాథ్ శుక్రవారం సందర్శించారు. ఒపి విభాగంతో పాటు పలు విభాగాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రోగులతో మాట్లాడి సేవలు ఎలా అందుతున్నాయని వివరాలను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. రక్త నిల్వల కొరతగా ఉన్నాయని వైద్యులు చెప్పడంతో ఈనెల 15న రక్తదాన శిబిరం ఏర్పాటు చేయిస్తానని సబ్ కలెక్టర్ హామీ ఇచ్చారు.

ఆర్ఆర్‌బి పురం రోడ్డుపై వంతెన నిర్మించాలి


ప్రజాశక్తి - కురుపాం

జియ్యమ్మ వలస మండలంలో గల రావాడ రామభద్రపురానికి వెళ్లే రహదారి వద్ద ఉన్న కాజ్‌వే స్థానంలో శాశ్వత వంతెన నిర్మించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. అల్పపీడన ప్రభావంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు రావాడ వట్టిగెడ్డ రిజర్వాయర్‌కు వరద నీరు వచ్చి చేరడంతో అప్రమత్తమైన అధికారులు నీటిని కిందకు విడిచిపెట్టారు. దీంతో రావాడ రామభద్రపురం సమీపాన గల ప్రధాన రహదారిపై ఉన్న కాజ్‌వే పైనుండి నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. గురువారం సాయంత్రం ఉపాధ్యాయుడు మూటక చక్రపాణి విధులు ముగించుకొని కురుపాం ఇంటికి ద్విచక్ర వాహనంతో వెళ్తుండగా నీటి ఉధృతికి కొట్టుకుపోయారు. వెంటనే స్థానికులు చూసి కొట్టుకుపోతున్న ఉపాధ్యాయుడ్ని కాపాడి, ద్విచక్ర వాహనాన్ని బయటకు తీశారు. రిజర్వాయర్ నుంచి నీరు విడుదల చేస్తే కాజ్‌వే పై నుంచి నడుము లోతు నీరు ప్రహహిస్తుంది. దీంతో కురుపాం - రావాడ రామభద్రపురంతో పాటు మరో 30 గిరిజన గ్రామాల రాకపోకలు అంతరాయం ఏర్పడింది. స్పందించి కాజ్‌వే స్థానంలో శాశ్వత వంతెనను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉపాధ్యాయుడిని రక్షించిన స్థానికులు



కొట్టుకుపోతున్న ఉపాధ్యాయుడ్ని రక్షిస్తున్న స్థానికులు



రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా సిఎం చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకుంటున్న జియ్యమ్మవలస మండలం పెదబుడ్డిడి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు శంకరరావు

బయో విలేజ్‌గా మారాలి


ప్రజాశక్తి - సీతంపేట

ప్రతి గ్రామం బయో విలేజ్‌గా మారాలని ప్రకృతి వ్యవసాయం డిపిఎం శ్రావణ్ కుమార్ అన్నారు. మండలంలోని గొయిదిలో ప్రకృతి వ్యవసాయం డిపిఎం శ్రావణ్ కుమార్ క్షేత్రస్థాయిలో శుక్రవారం సందర్శించారు. తోయక వరహాలమ్మ ఎన్ఎపి పొధులను పరిశీలించారు. అనంతరం, సూచనలు అందించారు. ఈ గ్రామం మొత్తం బయో గ్రామం చేయాలని చెప్పారు. జామి గ్రామం లో జీడీ లో అంతర పంటలు పరిశీలించారు. అనంతరం దిబ్బగూడలో బంగ్లాతో శ్రీను ఎటిఎం నమూనాను పరిశీలించారు. అలాగే అదే రైతు అరటిలో అంతర్ పంట పెసర, మినుములు, ముల్లంగి, బెండ, తోటకూర, గోంగూర, క్యారెట్ పంటలను పరిశీలించారు. రైతు 25 సెంట్ల విస్తీర్ణంలో వేసుకున్న మారిసస్ ఫ్యా పైనాపిల్ పంటను పరిశీలించారు. రైతులతో ఐసిఆర్‌పిలతో సాంకేతిక సూత్రాలు గురించి, ఎటిఎం, ఎ గ్రేడ్ మోడల్స్, బయోవిలేజ్ గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతి గ్రామం బయో విలేజ్‌గా మారాలని, బయోగ్రామాలుగా మారడానికి ప్రణాళికలు గుర్చి వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ మసుయ్య, డివిజన్ ఇన్‌ఛార్జిలు, బాలు అంబోజీ, మండల ఇన్‌ఛార్జ్ సత్యనారాయణ, యూనిట్ ఇన్‌ఛార్జిలు నరేష్ ధర్మ, రమేష్, కేబ్ ఐసిఆర్‌పిలు పాల్గొన్నారు.

ఐటిడిఎ పిఒగా అశుతోష్‌నే నియమించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

ఐటిడిఎ పిఒగా అశుతోష్ శ్రీ వాత్సవ్‌నే కొనసాగించాలని కోరుతూ జిల్లాలోని గిరిజన, ప్రజాసంఘాల నాయకులు శుక్రవారం ఆయనను కలిసినట్లు తెలుస్తోంది. గడచిన ఏడాదిన్నర కాలంగా ఐటిడిఎ పిఒగా గిరిజన సమస్యల పరిష్కారానికి కొంతమేరకు ఆయన స్పందన బాగుందని సంఘాల నాయకులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో వారు అశుతోష్ శ్రీవాత్సవ్‌ను కలిసి బదిలీ అయినా పార్వతీపురం విడిచి వెళ్లవద్దని కోరినట్లు తెలిసింది. ఐటిడిఎ పిఒగా అశుతోష్ శ్రీ వాత్సవ్‌నే కొనసాగించాలని కోరుతూ జిల్లా ఇంఛార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ప్రభుత్వ విప్ జగదీశ్వరి, జిల్లాకు చెందిన ఎస్టీ ఎమ్మెల్యేలతో కలిసి కలిసి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు వారు నిర్ణయించుకున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ మేరకు గిరిజన సంఘాలు, ప్రజా సంఘాల జెఏసి గా ఏర్పాటై కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం.



ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

తాగునీరు, రోడ్ల సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కి వినతులు అందించారు. ముఖ్యంగా తాగునీటి సమస్య పరిష్కరించాలని, గ్రామాలకు రోడ్లు వేసి రవాణా సౌకర్యం కల్పించాలని తదితర సమస్యలను పరిష్కరించాలని ఎక్కువగా వినతులు వచ్చాయి. సమస్యలపై సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా తెలియజేసి వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నియోజకవర్గంలో ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేసి అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు.


కషాయాలతో పంటకు రక్షణ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రకృతి వ్యవసాయ సాగులో వేస్తున్న పంటలకు వర్షాకాలంలో వచ్చే తెగుళ్ల నుంచి దశపర్ణి కాషాయం వినియోగంతో రైతులు పంటలను కాపాడుకోవచ్చని ప్రకృతి వ్యవసాయం గుమ్మలక్ష్మీపురం యూనిట్ ఇన్‌ఛార్జి కిమిడి భూషణ అన్నారు. మండలంలోని రేగులపాడులో గిరిజన రైతులతో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సామూహికంగా రైతులతో దశపర్ణి కాషాయం తయారు చేయించారు. ఖరీఫ్ సీజన్‌లో తుపాను కారణంగా పంటలపై తెగుళు పురుగులు ఎక్కువగా ఆశించడానికి ఎక్కువగా అవకాశం ఉందని అన్నారు. వరి పంట రక్షణకు దశపర్ణి కాషాయం ఎంతో మేలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఐసిఆర్‌పిలు కద్రక దీప, బిడ్డిక రాజకుమార్, బిడ్డిక దాలయ్య ఉన్నారు.

నేమాస్త్రం వినియోగం ఎంతో మేలు

జియమ్మ వలస మండలం తురకనాయుడు వలస పంచాయతీలో వ్యవసాయ నిపుణులు హెచ్‌ఆర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నేమాస్త్రం తయారు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ నేమాస్త్రం తయారీ కోసం 140 లీటర్ల నీరు, 10లీటర్ల గోమూత్రం, 2 కిలోల పేడ, 8కిలోల వేపాకు తీసుకోవాలని అన్నారు. ముందుగా ఒక డ్రమ్మును తీసుకొని అందులో పేడను కలిపి తరువాత గో మూత్రం వేసి అనంతరం నీటిని పోసి ఆ తరువాత ముద్దగా చేసిన వేపాకును దానిలో వేసి మూత వేసి సుమారు ఆ ద్రావనాన్ని మూడు రోజులపాటు నిల్వ ఉంచుకోవాలని తెలిపారు. అనంతరం ఆ ద్రావనాన్ని వడకట్టి పంట పొలంలో పిచికారి చేస్తే చీడ పురుగులు ఉండవని, తద్వారా అధిక పంట దిగుబడి వస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఎమ్. గౌరునాయుడు, ఉమామహేశ్వరీ, పలువురు రైతులు పాల్గొన్నారు.



తెట్టంగిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్నవైసిపి నాయకులు లక్ష్మణరావు

తెట్టంగిలో బాబు ష్యూరిటీ... మోసం గ్యారెంటీ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని తెట్టంగిలో శుక్రవారం పాలకొండ నియోజకవర్గం వైఎస్‌ఆర్ యువజన విభాగం అధ్యక్షులు పి.లక్ష్మణరావు ఆధ్వర్యంలో బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయలేదని, ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందించకుండా అనర్హులుకు అందిస్తున్నారని విమర్శించారు. రైతు సేవా కేంద్రం ద్వారా రైతులకు ఎరువులు పంపిణీ చేయడంలో పూర్తిగా ప్రభుత్వం విఫలమైందని, ఈ విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. . కార్యక్రమంలో పి.పరిశినాయుడు, అలజంగి ఎలియా, సతివాడ చిన్నంనాయుడు, కృష్ణం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలో కె.వీరఘట్టాం పంచాయతీ పెద్ద తంకిడి గ్రామంలో శుక్రవారం బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. దోనుబాయి సర్పంచ్ కె.వెంక నాయుడు ఎంపిటిసి గేదెల కోటేశ్వరరావు, పాలకొండ ఎస్‌టి నియోజవర్గ కన్వీనర్ నిమ్మక కాంతారావు, పెంటయ్య, రమణారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి పాము కాటు

సీతానగరం : మండలంలోని పెద భోగిలి దళితవీధికి చెందిన ముక్కల నిహారిక తన ఇంటి వద్ద బాత్రూంకి వెళుతుండగా గుర్తుతెలియని పాము కాటు వేసింది. దీంతో గమనించిన ఆమె కుటుంబీకులు స్థానిక పిహెచ్‌సికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం పార్వతీపురం జిల్లా హాస్పిటల్‌కు తరలించారు.

డ్రగ్స్ వినియోగిస్తే వినాశనమే : ఎఎస్‌పి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

డ్రగ్స్ వినియోగిస్తే వినాశనమేనని ఎఎస్‌పి అంకిత సురాన అన్నారు. పట్టణంలోని వాసవీ గాయత్రి డిగ్రీ కళాశాలలో శుక్రవారం జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఎఎస్‌పి మాట్లాడుతూ బంగారు జీవితానికి బాటలు వేసేది ఉపాధ్యాయులే అన్నారు. పిల్లల దినచర్యను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గమనించాలన్నారు. వారిని సన్మార్గంలో నడపాలన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు "టీచర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో సమస్యలు వస్తాయన్నారు. వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. మంచి మార్గదర్శకత్వం కోసం గురువులు, తల్లిదండ్రులను ఆశ్రయించాలన్నారు. కష్టపడి చదివి, ఒక లక్ష్యం కోసం కేంద్రీకృత కృషి చేస్తే విజయాన్ని సాధించగలరన్నారు. ప్రతి ఒక్కరికీ విద్యార్థి దశ కీలక మన్నారు. వ్యసనాలకు దూరంగా ఉండి మంచి మార్గంలో పయనించాలన్నారు. స్మోకింగ్, డ్రింకింగ్, గంజాయి, తదితర డ్రగ్స్ వినియోగం, బెట్టింగ్ తదితర వాటికి దూరంగా ఉండాలన్నారు. విద్యార్థి దశలో వాటికి దగ్గరైతే జీవితం నాశనం అవుతుందన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. విద్యా సంస్థల కరస్పాండెంట్ పీవీకే మణికుమార్, అధ్యాపకులు ఎంవిఎస్ శర్మ, విద్యార్థుల సమక్షంలో 'గీత ఈజ్‌మై ఫ్రైండ్‌ను అనే షార్ట్‌ఫిల్మ్ ప్రత్యేక ప్రదర్శన జరిగింది. అనంతరం యుక్త వయసులో ప్రేమ ఆకర్షణ, బెట్టింగ్, సిగరెట్, మందు, గంజాయి, డ్రగ్స్ వినియోగం, తదితర వ్యసనాల్లో కూరుకుపోయి వాటి నుంచి బయటపడలేక ఆత్మహత్యకు ప్రయత్నించే యువతను భగవద్గీత బోధన ద్వారా మంచి మనిషిగా తీర్చిదిద్దే ఒక సందేశాత్మకమైన షార్ట్ ఫిలిం గీత ఈజ్‌మై ఫ్రెండ్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ చిత్రంలో ప్రధాన పాత్రలో నటించిన వంగల దాలినాయుడు, అజయ్ మహేశ్వరరావు, కథ, మాటలు, స్క్రీన్‌ప్లే, ఎడిటింగ్, దర్శకత్వం సతీష్ కుమార్ ఏగిరెడ్డిని అభినందించారు. ఈ చిత్రం వైఎస్‌కె మూవీష్ యూట్యూబ్ ఛానెల్‌లో స్ట్రీమింగ్ అవుతోందన్నారు. చిత్రానికి ప్రత్యేకతగా ఎ1 టెక్నాలజీతో సంగీతం సమకూర్చడం ఆకర్షణీయంగా ఉందన్నారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎఎస్‌పి అంకిత సురాన

గ్రీన్ అంబాసిడర్ల బకాయి వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి- వీరఘట్టం

గ్రీన్ అంబాసిడర్‌లకు బకాయి వేతనాలు చెల్లించాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, సిఐటియు మండల కన్వీనర్ నులకజోడు ప్రసాద్ డిమాండ్ చేవారు. గ్రామపంచాయతీ గ్రీన్ అంబాసిడర్ మండల నాయకులు ఏళ్ల ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుకు ఎంతో చిత్తశుద్ధితో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్‌ల పట్ల ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యం వహించడం సమంజసం కాదని విమర్శించారు. ప్రభుత్వం నేరుగా పారిశుద్ధ్య కార్మికులకు(గ్రీన్ అంబాసిడర్లకు) జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు పాత వేతనాల బకాయిలు ఉన్నాయని, సుమారు ఎనిమిది నెలల వేతనాలు చెల్లించాల్సి ఉందని దీనికి అధికారుల నిర్లక్ష్యమే కారణమని అన్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు, లేనియెడల కార్మికులను ఐక్యం చేసి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వీరఘట్టం మండలాల గ్రీన్ అంబాసిడర్ యజ్జల లక్ష్మణ వెంకటరమణ గణేష, మోహన్ రావు, గణపతి గంగయ్య లక్ష్యం మధు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న గ్రీన్ అంబాసిడర్లు

ఎమ్మెల్యేను కలిసిన ఆర్‌టిసి డిఎం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్‌గా ఎస్.లక్ష్మణరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆర్టీసీ యూనియన్ నాయకులతో కలిసి టిడిపి కార్యాలయం చేరుకుని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్రను మర్యాదపూర్వకంగా కలుసుకుని ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రయాణికులకు రవాణా పరంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, స్త్రీ శక్తి పథకానికి సంబంధించి బస్సులను మహిళలకు ప్రతినిత్యం అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్, పరిసర ప్రాంతాల్లో ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. దీనికి సంబంధించి తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని డిఎంకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఆర్టీసీ యూనియన్ నాయకులు మరిపి శ్రీనివాసరావు, కత్తిరి నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టిల్లో ఉత్తమ ఉపాధ్యాయులు లేరా?

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక ఐటిడిఎ పరిధిలో ఉన్న ఉమ్మడి జిల్లాల్లో ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికలో గిరిజన ఉపాధ్యాయులకు అన్యాయం జరిగిందని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు పల్లా సురేష్ అన్నారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న గిరిజన ఉపాధ్యాయులకు గుర్తింపు లేకపోవడం బాధాకరమని చెప్పారు. గిరిజన సంక్షేమ శాఖలో ఎక్కువగా గిరిజన ఉపాధ్యాయులే ఉన్నారని చెప్పారు. ఈ వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన జిల్లా విద్యాశాఖాధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చిన సర్వేపల్లి

ప్రజాశక్తి - పాలకొండ

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చారని విజయనగరం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి సువ్వాల తవిటినాయుడు అన్నారు. ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ బాలురు జూనియర్ కళాశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి రెండో రాష్ట్రపతి సర్వేపల్లి అని అన్నారు. ఆయన ఆశయాలకు ఉపాధ్యాయులంతా పనిచేయాలన్నారు. అదేవిధంగా 28 ఏళ్లుగా ఈ కళాశాలలోనే పనిచేశానని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ హరిగోపాల్, అధ్యాపకులు బయలు శంకర్రావు, గోవిందరావు, శివ, నాగభూషణరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి అప్పారావు, చంద్రరావు, విజయకుమార్, శ్రీను తదితరులు ఉన్నారు

వివేకానంద విద్యా భారతిలో...

సీతంపేట : స్థానిక వివేకనంద విద్యా భారతిలో గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉత్తమ ఉపాధ్యాయులైన చుక్కలు దుర్గాప్రసాద్‌రావు, హరినాన ప్రకాశంను దుశ్శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ వేమకోటి సాయికృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే సామరెల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్ర పటానికి ప్రధానోపాధ్యాయులు పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. పాఠశాలలో విద్యార్థులకు ఆటల పోటీలు, సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ప్రధానోపాధ్యాయుల ఆరిక భాస్కరరావుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు సన్మానించారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని భద్రగిరి (పి టి జి) బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులు చీరకట్టులో వేషధారణతో అలరించారు. విద్యార్థులు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సత్యవతి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి అనుకున్న లక్ష్యాలు సాధించాలని కోరారు. ప్రభుత్వం విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



వీరఘట్టంలో ప్రశంసాపత్రాలు అందుకున్న ఉపాధ్యాయులు

ఉత్తమ ఉపాధ్యాయులకు ప్రశంసా పత్రాలు

వీరఘట్టం : స్థానిక విద్యా వనరుల కేంద్రంలో మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన టీర్లను ఎంఇఒలు డి.గౌరునాయుడు, ఆనందరావు ఘనంగా సన్మానించారు. చే బియ్యంవలస, వీరఘట్టం రెగ్యులర్ పాఠశాల, వీరఘట్టం, వీరఘట్టం బీసీ కాలనీ, ఎన్‌విపురం, కంబర, సంతనర్సిపురం, వండువ, హుస్సేనపురం, కంబర వలస, బిటివాడ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు బి.సూర్యనారాయణ, వి.అరుణ ప్రియ, టి.బాలమురళి, ఎం.ముకుందరావు, ఎం.నరహరి, ఎన్.మానస, బి.ఆదిలక్ష్మి, బి.శైలజ, డి.చంద్రమౌళి,దినాకర్, ఆర్.సంగయ్యకు మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కత్తుల కవిటి, కంబర వలస స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్లు పి సుధారాణి, ఆర్.రామారావుతో పాటు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని పనుకుపేటలో ఎస్‌జిటిగా పనిచేస్తున్న చప్ప ఈశ్వరరావు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. విద్యార్థుల అభ్యాసాన్ని మెరుగుపరిచే దిశగా ఆయన చూపిన కృషిని గుర్తించి, శుక్రవారం (సెప్టెంబర్ 5) జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఈ అవార్డును ప్రధానం చేశారు.

ఎక్కడికక్కడే గోతులు


కాలం చెల్లిన బస్సులతో తిప్పలు

ప్రజాశక్తి - సీతానగరం

జాతీయ రహదారిపై ఎక్కడికక్కడే గోతులు ఉండడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బొబ్బిలి నుంచి పార్వతీపురం ప్రయాణించే జాతీయ రహదారిపై పాత బొబ్బిలి నుంచి లచ్చపేట మధ్యలో గోతులు ఏర్పడ్డాయి. అలాగే కాశీపేట నుంచి చినబోగిలి మధ్యలోని చినబోగిలి రైల్వే ట్రాక్ నుంచి సీతానగరం బ్రిడ్జి వరకు ఎక్కడకక్కడ గోతులు ఉన్నాయి. అక్కయ్యపేట నుంచి జోగింపేట, జోగింపేట నుంచి గుచ్చిమి వరకు రోడ్డుపై ఎక్కడిక్కడే గోతులు ఏర్పడడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు పార్వతీపురం ఆర్టీసీ డిపోకు చెందిన బస్సులు కాలం చెల్లినవి కవడంతో విపరీతమైన పొగ వదలడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీతానగరం నుంచి బొబ్బిలి వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఆ బస్సు వెనుక నుంచి ప్రయాణం చేస్తే విపరీతమైన పొగ వాహనదారులకు రావడంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఆర్‌టిసి అధికారులు కాలం చెల్లిన బస్సులు తిప్పడంతో ప్రజలు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ప్రభుత్వమే కాలం చెల్లిన వాహనాలను సీజ్ చేయాలని, లేకపోతే రోడ్డుపై తిప్పరాదని దీనివల్ల కాలుష్యం ఏర్పడి ప్రమాదం ఉందని తెలిసినప్పటికీ అధికారులు ఇలా వ్యవహరించడం ఆశ్చర్యపరుస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గోతులను పూడ్చి కొత్త బస్సులను తీసుకొని తిప్పే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు



గోతులమయమైన సీతానగరం- పార్వతీపురం రోడ్డు



సాలూరులో సంచరిస్తున్న సైబీరియా పక్షులు

సాలూరులో సైబీరియా పక్షులు

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని కెవిఆర్ ఎస్టేట్ ఆవరణలోఉన్న చెట్లపై గత కొంతకాలంగా సైబీరియా పక్షులు వాలుతున్నాయి. ఈ ప్రాంతంలో ఉన్న చెరువు పక్కన ఉన్న చెట్లపై రోజూ సాయంత్రం వేళల్లో ఈ పక్షులు వుంటున్నాయి. ఇది గమనించిన నీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ వేణుగోపాల్ ఈ దృశ్యాన్ని తన సెల్ ఫోన్‌లో బంధించారు. సాయంత్రానికి ఇక్కడికి చేరుకుని ఉదయానికి కనిపించకుండా ఎటో వెళ్లిపోతున్నాయని వేణుగోపాల్ తెలిపారు.

వినాయక నిమజ్జనంలో పాల్గొన్న బేబి నాయన

ప్రజాశక్తి -సీతానగరం

స్థానిక వెలమ వారి వీధిలో శుక్రవారం జరుగుతున్న వినాయక నిమజ్జన కార్యక్రమంలో బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయన పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నాయకులు చెలికాని గోపాలకృష్ణ, ఎస్.కన్నారావు, ఎస్ హరి గోపాల్‌రావు, పెదబోగిలి సర్పంచ్ జొన్నాడ తేరేజమ్మ, ఉప సర్పంచ్ కె అరవింద్ కుమార్, మాజీ సర్పంచ్ బుడిది శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాసరావు, సీతానగరం ఆయకట్టు సంఘం అధ్యక్షులు చింటూ వెంకటప్పలనాయుడుతో పాటు స్థానిక యువత పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు వెంకటరమణ

7న ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ జిల్లా మహాసభ

ప్రజాశక్తి - పార్వతీపురం

ఈనెల 7న స్థానిక గిరిజన సామాజిక భవనంలో జరుగు ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ల ప్రథమ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ, కోశాధికారి గొర్లి వెంకటరమణ, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షులు మండంగి హరినాధ్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. 20ఏళ్లుగా అనేక కష్టాలకు ఓర్చి ఫీల్డ్ అసిస్టెంట్లు విధులు నిర్వహిస్తున్నప్పటికీ కనీస గుర్తింపు ప్రభుత్వం కల్పించకపోవడం విచారకరమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఉపాధి పనులు కల్పించి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల పట్ల ఇంత నిర్లక్ష్యం ఎందుకని ప్రశ్నించారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న అనేకమంది ఇందులో భవిష్యత్తు ఉంటుందని ఆశతో పని చేస్తున్నారని, కేవలం రూ.6 వేలు వేతనం చెల్లించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు. దీనికి తోడు సోషల్ ఆడిట్ పేరుతో సాంకేతిక కారణాలను సాకుగా చూపించి లక్షలాది రూపాయలు రికవరీలు విధిస్తున్నారని అన్నారు. ఇది పొమ్మను లేక పొగ పెడుతున్న చందంగా ప్రభుత్వ విధానం ఉందని, జిల్లా అధికారులు కూడా ఫీల్డ్ అసిస్టెంట్ల పట్ల కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ సమస్యలన్నీ పరిష్కారం కావాలంటే ఫీల్డ్ అసిస్టెంట్లంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సమస్యలపై పోరాట కార్యక్రమం రూపొందించేందుకు జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ జిల్లా మహాసభలకు సిఐటియు రాష్ట్ర కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు హాజరవుతున్నారని, కావున ఫీల్డ్ అసిస్టెంట్లు అంతా పాల్గొని ఈ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఫీల్డ్ అసిస్టెంట్ సంఘం నాయకులు పోతుల రామారావు, లాడి దుర్గారావు, ఊల్ల నాగరాజు, అప్పల నాయుడు, తిరుపతిరావు పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరా బంద్

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక మున్సిపాల్టీలో హెడ్ వాటర్ పనుల నిమిత్తం శనివారం పట్టణంలో తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు కమిషనర్ రత్నకుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎలక్ట్రికల్ మెయిన్ లైన్ బ్రేక్ డౌన్ కారణంగా శనివారం ఒకరోజు నీటి సరఫరా చేస్తున్నామని, ఈ విషయమై ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.



ఒడిశాకు తరలిపోతున్న బియ్యాన్ని పట్టుకున్న విజిలెన్స్ అధికారులు (ఫైల్)

ఇక్కడ రూ.18... అక్కడ రూ .30

యథేచ్ఛగా బియ్యం అక్రమ రవాణా
చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని పలు రహదారుల గుండా పక్క రాష్ట్రమైన ఒడిశాకు పేదల బియ్యం యథేచ్ఛగా అక్రమ రవాణా సాగుతుందన్న ఆరోపణలు దండిగా వినిపిస్తున్నాయి. ఇక్కడ కొనుగోలు చేసిన బియ్యం వ్యాపారులు పలు రహదారుల గుండా అక్రమంగా ఒడిశాకు తరలిస్తున్నారు. ఈ విషయం ఇటీవలే మంగళవారం విజిలెన్స్ దాడిలో పట్టుబడిన సంగతి వెలుగు చూసింది. మండలంలోని పలువురు వ్యాపారులు ప్రజల నుంచి కిలో 18 రూపాయలకు కొనుగోలు చేసి, పక్క రాష్ట్రమైన ఒడిశాఖలో సుమారు రూ.30 వరకు ధర పలకడంతో ఈ అక్రమ రవాణాకు అడ్డూ, అదుపు లేకుండాపోతుంది. ప్రతి నెలా ఆఖరి వారంలో అక్రమ వ్యాపారులు గుట్టు చప్పుడు కాకుండా వారు కొనుగోలు చేసిన బియ్యాన్ని నంద, ఎర్ర సామంత వలస, పార్వతీపురం మండలం గోచెక్క సమీపాన ఒడిశాకు వెళ్తున్న మార్గాల ద్వారా ఈ రవాణా సాగుతున్నట్లు సమాచారం. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.